www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 26 ఫిబ్రవరి 2025

5

చిత్తూరు

28న జాబ్ మేళా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడీఏప్ డిఆర్డిఏ సంయుక్తంగా ఈ నెల 28వ తేదీ శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ కార్యాలయం చిత్తూరులో, ప్రభుత్వ ఐటిఐ పుంగనూరు కళాశాలలో నిర్వహించే జాబ్ మేళాను ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం జిల్లా ఉపాధి అధికారి జి.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ కార్యాలయం చిత్తూరులో క్రియా నెక్స్‌వెల్త్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీస్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు అలాగే ప్రభుత్వ ఐటిఐ పుంగనూరు కళాశాలలో అమరరాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు జాబ్ మేళాలో పాల్గొంటున్నారని తెలిపారు. కనీస విద్యార్హత ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ ఫెయిల్/పాస్ అయిన 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. మరిన్ని వివరాల కోసం చిత్తూరులో లోకేష్ (99635 61755), పుంగనూరులో సుబ్రమణ్యం (77805 99208) సంప్రదించాలన్నారు.

- తగ్గిన పూత
- నిలబడని పిందె
- ఆందోళనలో మామిడి రైతన్నలు

'వింత' వాతావ'రణం'

ఆ(నిరా)శలలో రైతులు

జిల్లాలో వరి, వేరుశనగ పంటల తర్వాత ప్రముఖంగా చెప్పుకోదగ్గ ఉద్యాన పంట మామిడి. జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు రైతులు. వేల కుటుంబాలు మామిడి పంట సాగే ప్రధానంగా ఎంచుకుని జీవిస్తున్నారు. అటువంటి మామిడి రైతుకు ఈసారి ఆశలు నిరాశలయ్యేలా ఉంది. ఫిబ్రవరి పూర్తి అవుతున్నా ఇప్పటికే చాలాచోట్ల సరిగా పూత లేదు.. ఒకపక్క మామిడి చెట్టు విపరీతంగా లేత ఆకులతో చిగురిస్తున్నాయి. మరో పక్క మామిడి చెట్టు నిండా పూత, పిందెతో నిండి ఉంది. ఇలా జిల్లాలో మామిడి తోటల్లో మూడు రకాలగా వింత వాతావరణం మామిడి తోపుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే చాలాచోట్ల సరిగా పూత లేదు, ఒకవేళ పూత ఉన్నా పొగమంచు కారణంగా పిందె నిలబడటం లేదు. ఆలస్యంగా పూత పూసినా అధిక దిగుబడి వచ్చే అవకాశాలు చాలా తక్కువ. వెరసి ఈ ఏడాది జిల్లాలో మామిడి రైతుకు నష్టమే మిగిలే పరిస్థితులు కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

చిత్తూరు జిల్లాలో 1,50,000 హెక్టార్లలో మామిడి పంట విస్తరించి ఉంది. గత రెండు సంవత్సరాలుగా పంట దిగుబడి తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారైనా దిగుబడులు బాగా వచ్చి ధర కూడా ఆశించిన రీతిలో ఉంటే ఎంతో కొంత లాభపడదామని మామిడి రైతులు ఎన్నో కలలు కంటున్నారు. అయితే వాతావరణ మార్పుల కారణంగా ఒకే మామిడి తోపులో మూడు రకాలుగా కొన్ని చెట్లలో లేత పూత, మరికొన్నింటి అసలు పూతే లేదు. ఫిబ్రవరి నెల చివరికి వచ్చినా ఇప్పటివరకు పిందె నిలబడకుండా ఉండడం రైతులను మరింత ఆందోళన గురి చేస్తుంది. ఇప్పటికే జిల్లాలో ఎండలు అధికంగా ఉండడంతో ఎండ తీవ్రత అధికమయ్యేకొద్దీ మామిడి పిందెలు ఎంతవరకు నిలుస్తాయో అని ఆందోళన ఉంది. ప్రస్తుతం మామిడి చెట్లలో పూత ఎక్కువగా ఉన్నా వేసవిలో మామిడి పిందెలు రాలిపోతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా దిగుబడి తక్కువైనా రేట్లు మాత్రం అంతంత మాత్రమే. ఒకవేళ కోతకు వచ్చిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే దళారుల దోపిడీ అధికంగా ఉంది. వ్యాపారులు సిండికేట్‌గా

అసలు చిగురు, పూత లేని మామిడి చెట్లు

సస్యరక్షణ చర్యలు అవసరం

డాక్టర్ మధుసూదన్ రెడ్డి, చిత్తూరు జిల్లా ఉద్యానవనశాఖాధికారి

మామిడి పూతదశలో ప్రస్తుతం కనిపించే పురుగు, తెగుళ్లను నివారించుకోవాలి. పూతదశలో గొంగళి పురుగులు నివారణకు ఇమామెక్టిన్ బెంజొయిట్ ఒక లీటర్‌కి 0.5 గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలి లేదా థయోక్లో 0.5 గ్రాముల ఒక లీటర్ చొప్పున పిచికారి చేసుకోవాలి. తామర పురుగు నివారణకు రీజెంట్ లేక రోగార్ పిచికారి చేసుకోవాలి. జంప్ 0.4 గ్రాములు వేప నూనె ఒక లీటర్‌కి రెండు గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలి. మామిడి రైతులు సస్యరక్షణ, అధికారులు చెబుతున్న సూచనలు పాటించడం ద్వారా మంచి పంట దిగుబడి పొందవచ్చు.

ఏర్పడి రైతుల నుంచి మామిడికాయలు తక్కువ ధరకు తీసుకుంటున్నారు. ఈ సంవత్సరం గాని ఇలాగే కొనసాగితే గిట్టుబాటు ధర లేకుండా మావిడి రైతులు తీవ్రనష్టం చవిచూడాల్సి వస్తుంది. పంటలు పండించడంలో రైతులు అతివృష్టి అనావృష్టితో ఇబ్బందులు పడుతూ ఉన్న ఉద్యాన పంటైనా రైతులకు ఆసరాగా నిలుస్తాయని ఆశించారు. అయితే ఈసారి మామిడి పంట ఆశించిన మేర కాపు వస్తుందా.. కాపు వచ్చినా.. పంటకు గిట్టుబాటు రేటు వస్తుందో లేదో అని రైతులు ఆశనిరాశలతో ఎదురు చూస్తున్నారు.

నష్టం 100 కోట్లపై మాటే....

గత సంవత్సరం రష్యా ఉక్రెయిన్ యుద్ధం కారణంగా చిత్తూరు జిల్లాల నుండి మామిడి పల్ప్ ఎగుమతి కాకపోవడంతో జిల్లాలోని అన్ని మామిడి గుజ్జు పరిశ్రమల్లో టన్నుల కొద్దీ పల్ప్ నిల్వ ఉంది. దీంతో ఈసారి మామిడి గుజ్జు పరిశ్రమలు రైతుల వద్ద నుండి మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తారో లేదో అని రైతులు వాపోతున్నారు. మామిడి పల్ప్ ఈసారి కూడా విదేశాలకు ఎగుమతి లేకపోతే గిట్టుబాటు ధర మామిడి రైతులకు ప్రశ్నార్థకంగా మారనుంది.

మామిడికి విదేశాల్లో సైతం మంచి గిరాకీ ఉంది. ఉత్తర భారతదేశంలో పలు రాష్ట్రాల్లో ఇక్కడినుండి మామిడికాయలు ఎగుమతి అవుతాయి. సాధారణంగా ఎకరా మామిడి తోటలో ఆరు నుండి ఐదు టన్నులకు దిగుబడి వస్తుంది. అందులో ఈసారి 25 శాతం కూడా ఉండకపోవచ్చు అనే రైతులు అంటున్నారు. గతేడాది జిల్లాలో మామిడి పంట చాలా వరకు దెబ్బతింది. ఈసారి వాతావరణ మార్పులు మామిడి పండుపై తీవ్ర ప్రభావం చూపనుంది. జనవరి నుండి పొగమంచు విపరీతంగా ఉంది. దీంతో పూతకు వచ్చిన మామిడి చెట్లలో పూత రాలిపోతుంది. విపరీతమైన బంకా తేనె మంచు పురుగులు దారాల పురుగులను అరికట్టేందుకు రైతులు మందులు పిచికారి చేశారు. ప్రతి సంవత్సరం పూత రాకముందు ఒకసారి పూత వచ్చిన తర్వాత ఒకసారి పిచికారి చేసేవారు. అయితే ఈసారి తెగులు నివారణ కోసం మూడు నుంచి నాలుగు సార్లు పిచికారి చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

మామిడి పూతతో నిండి ఉన్న చెట్లు

లేత చిరుగుతో ఉన్న మామిడి చెట్లు

మామిడి చెట్లను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

సభా స్థలాన్ని, హెలిప్యాడ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

రామానాయుడు పల్లి వద్ద హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మార్చి 1 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా జీడి నెల్లూరు మండలంలో పెన్షన్లు పంపిణీ నేపథ్యంలో మంగళవారం జీడి నెల్లూరు హరిజనవాడ, రామానాయుడుపల్లిలో సభావేదిక, హెలిప్యాడ్ ఏర్పాటుకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పి.వెంకటేష్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పి మణికంఠ చందోలుతో కలసి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, కాన్వాయ్ నిర్వహణ, ప్రజావేదిక, పెన్షన్ పంపిణీకి లబ్ధిదారుల ఎంపిక సంబంధిత అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త జిల్లా కలెక్టర్, ఎస్పితో చర్చించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, అడిషనల్ ఎస్పి శివానంద కిషోర్, పిఆర్ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్, డీఎస్పీ సాయినాథ్, టిఆర్‌డిఈ ఆనంద రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి :కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్చి 1న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు రానున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ముఖ్యమంత్రి పర్యటన ముందస్తు ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా హెలిప్యాడ్, ముఖ్యమంత్రిచే పెన్షన్ పంపిణీ, ప్రజా వేదిక కార్యక్రమాలకు ఏర్పాటు చేయాలన్నారు. సభాస్థలం వద్ద తాగునీటి ఏర్పాటు, బ్యారికేడింగ్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను ప్రతిష్టాత్మకంగా భావించి అధికారులు తమకు కేటాయించిన విధులను నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. పెన్షన్ పంపిణీ లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలని, మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, హెలిప్యాడ్ ఏర్పాటుకు ఆర్ అండ్ బి అధికారులు పనులు ప్రారంభించార ,మిగిలిన శాఖలకు కేటాయించిన విధులను సమర్థవంతంగా భాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్టాల్స్ ఏర్పాటు చేయాల్సిన శాఖలు అందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పనులను ప్రతిబింబించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్‌ఓ కె. మోహన్ కుమార్, ఏఆర్ అడిషనల్ ఎస్పి శివానంద కిశోర్, జెడ్పి సిఈఓ రవి కుమార్ నాయుడు, పిఆర్ ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి, డ్వామా పీడీ రవికుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఎస్ఇ సత్యనారాయణ, సిపిఓ సాంబ శివారెడ్డి, డిఆర్డిఏ పీడీ శ్రీదేవి, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్థక శాఖల అధికారులు మురళికృష్ణ, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డీఈఓ వరలక్ష్మి, డీఎస్ఓ శంకరన్, డిటిసి నిరంజన్ రెడ్డి, డిపిఓ సుధాకర్‌రావు, డీఎస్పీ సాయినాథ్, కలక్టరేట్ ఏఓ కులశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అధికారులకు సమీక్ష సమావేశంలో కలెక్టర్

ఆరోగ్య విస్తరణ సేవలపై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డీటీ సుధారాణి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు స్టాఫ్ నర్స్‌కి ఆరోగ్య విస్తరణ సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశం మందిరం జరిగింది. ఇందులో భాగంగా మాత శిశు సంరక్షణ, కాన్పులు, కండక్ట్ చేసే విధానంపై, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, విరోచనాల కేసుల మెయింటినెన్స్‌పై, అగ్ని బాధితుల సేవలు, స్నేక్ బైక్, టీబీ, లెప్రోసి, వైరల్ జ్వరాలు మెయింటినెన్స్, వయస్సు పై బడినవారి సేవలు, సంక్రమణ అసంక్రమణ వ్యాధుల సేవలపై 3 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, ఫెసిలిటేటర్స్ డాక్టర్ లోహిత్, డాక్టర్ శివ కుమార్, పిహెచ్‌సిల నుంచి స్టాఫ్ నర్సు పాల్గొన్నారు.

11 మందితో ప్రతిపక్ష నేత ఎలా అవుతారు..

అసెంబ్లీలో ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గత ప్రభుత్వ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైసిపి ఎమ్మెల్యేల తీరును చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఎండగట్టారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీకి రావాలని తెలియని వ్యక్తి వైయస్ జగన్ అని, 11 మంది ఎమ్మెల్యేలతో ఎలా ప్రతిపక్ష నేత హోదా అడుగుతారని ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే అంశంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడారు. 11 మంది ఎమ్మెల్యేలతో ప్రతిపక్ష నేత పదవి కోసం గవర్నర్‌ను బెదిరించడం రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారని, 11 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో ముఖం చూపించలేక రాని పదవిని అడిగి బయటికి వెళ్లిపోయారన్నారు. చిన్నప్పుడు మార్కుల కోసం మారం చేసేవాడని విన్నాను.. ఇప్పుడు ప్రతిపక్ష నేత పోస్ట్ కోసం మారం చేస్తే కుదరదన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే విధంగా, అభివృద్ధి పంథాలో ముందుకు సాగుతుందన్నారు.

ఉద్యోగుల బిల్లులను వేగవంతం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రభుత్వ ఉద్యోగుల బిల్లులను వేగవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ అన్నారు. మంగళవారం బంగారుపాళ్యం ఉపఖజానా కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు అందించాల్సిన సేవలు, మెడికల్ సెలవులు అనంతరం విధులలో చేరిన ఉపాధ్యాయులకు అరియర్ బిల్లులు, సర్వీస్ నుండి రిటైర్ ఇన్కమ్ టాక్స్ రెగ్యులర్ బిల్లులు కాకుండా అరియర్ పేరుతో ఏ బిల్లు పెట్టినా ఆ బిల్లులను తిరస్కరిస్తూ గురికాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సరిత, మండల అధ్యక్షులు మహేష్ బాబు, మండల ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు అభివృద్ధి చెందాలి..

పిల్లలను బడికి పంపి చదివించాలి: జడ్జి భారతి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి భారతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గిరిజనుల హక్కులు, చట్టాలపై గిరిజన ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలం, దిగువ మాసపల్లి పంచాయతీ, బంగారెడ్డిపల్లి ఎస్టీ కాలనీలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో గిరిజనుల హక్కులు, చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గిరిజనులకు సంబంధించి కోర్టు కేసులు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా ఉచితంగా సత్వర న్యాయం పొందవచ్చునని తెలిపారు. గిరిజనులకు రాజ్యాంగంలో అనేక రకాల చట్టాలు ఉన్నాయని, ఆ చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని అన్నారు. చట్టాలు తెలుసుకొని వాటికి అనుగుణంగా గిరిజనులు జీవించాలన్నారు. గిరిజన పిల్లలందరినీ బడికి పంపించి చదివించుకోవాలని, 18, 21 సంవత్సరాలు నిండిన యువతకు మాత్రమే వివాహాలు చేయాలన్నారు. 18 సంవత్సరాల కంటే ముందుగా వివాహాలు చేస్తే వారి తల్లిదండ్రులకు, వారిని ప్రోత్సాహించిన వారికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయిలు జరిమానా విధించబడుతుందని తెలిపారు. ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తి మాట్లాడుతూ గిరిజనులకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి దృష్టికి తీసుకురావలని తెలిపారు. ఎస్టీ కాలనీకి సంబంధించి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడేవారని, ఈ సమస్యను ఇటీవల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని రావడంతో రోడ్డు సమస్యను పరిష్కరం చేయడం జరిగిందని, నెల రోజులలో రోడ్డు వేయడం జరుగుతుందని తెలిపారు. డివి అండ్ ఎంసి కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, ఎంపిడిఓ శ్రీనివాసులు, తహశీల్దార్ లోకేశ్వరి పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు, చికిత్స ఉచితం

జిల్లా ఉప వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: క్షయ వ్యాధికి నిర్ధారణ పరీక్షలు, చికిత్స పూర్తిగా ఉచితమని జిల్లా ఉప వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ తెలిపారు. టిబి వ్యాధి మానోత్సవాల్లో భాగంగా శుక్రవారం చిత్తూరు నగర పరిధిలోని సంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో టిబి వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రెండు వారాలకు పైబడి దగ్గు ఉన్నా, దగ్గినపుడు గళ్ళ పడటం, గళ్ళలో రక్తం పడటం, రోజు సాయంత్రం జ్వరం రావడం, గస, ఆయాసం, నీరసం, ఆకలి లేకపోవుట, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి అయి ఉండవచ్చు అని అనుమానించి సమీపంలో ఉన్న ఆశా, ఆరోగ్య సిబ్బందిని గాని సంప్రదించి వ్యాధి నిర్ధారణ కొరకు గళ్ళ పరీక్షలు నిర్వహించి నిర్ధారణ అయితే చికిత్స పూర్తిగా ఉచితమని, ఆరు నెలలు మందులు డాట్స్ ద్వారా అందిస్తారని, అలాగే టిడి రోగులకు నెలకు రూ.1000లు వారి ఖాతాలో జమచేయబడునని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పర్యవేక్షకులు ప్రభాకర్, మాధవి, ఆగర్యో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట ప్రసాద్

పెట్టుబడికి మించి ఆదాయం

- చీడ పీడలు ఆశించని పంట
- శివరాత్రికి ముందే పంటల ఒబ్బిడి

ప్రజాశక్తి- కార్వేటినగరం: చిలగడ దుంప (గెనిస గడ్డ) చేమగడ్డ, కావలిగడ్డ, కందగడ్డ ఇలా ఏ గడ్డలైనా ఆ గ్రామంలో దొరుకుతాయి. అక్కడి రైతులు కేవలం దుంపలను మాత్రమే ఆత్యధికంగా సాగుచేస్తారు. దుంపల సాగుకు అక్కడి నేల స్వభావం సహకరించడం, మార్కెటింగ్ సదుపాయం ఉండడంతో కార్వేటినగరం మండలంలోని కొల్లాగుంట గ్రామం దుంపల సాగుకు పుట్టినిల్లుగా ఉండేది. మహా శివరాత్రి నాటికి పంటలు చేతికి వచ్చేలా రైతులు పంట వేస్తుంటారు.

అనుకూలమైన నేల స్వభావం

కొల్లాగుంట సమీపంలోని నేల స్వభావం దుంపల సాగుకు అనుకూలం. కుశస్థలినదిని ఆనుకుని గ్రామం ఉండడంతో నీటి సమస్య లేదు. దుంపల పంటకు రోజు మార్చి రోజు నీరు అందించాలి. వరి సాగుతో పోలిస్తే ఈ పంటకు తక్కువ సాగునీరు సరిపోతుంది. ఈ పంటకు ఎలాంటి చీడపీడల భయము లేదు.

పొలంలో గెనిసి గడ్డలను నూర్పిడి పనుల్లో నిమగ్నమైన మహిళలు

ఆదాయం ఎక్కువే..

వరి, వేరుశనగ, సజ్జ, పొద్దుతిరుగుడు, పంటల కంటే దుంపల సాగుకు పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువగా ఉంటుంది. అన్ని రకాల వాతావరణ పరిస్థితులు ఈ పంట సాగుకు అనుకూలం. మార్కెటింగ్లో ఎప్పుడూ గిరాకీ ఉంటుంది. గెనిసిగెడ్డలు మినహా మూడురకాల గడ్డలు. ఆరు నెలలకు పైగా నిల్వ ఉంటాయి. వ్యాపారస్తులు కొనుగోలు చేస్తుంటారు. బస్తాకు 90 కేజీలు ఉంటాయి. ఎకరాకు 800 నుంచి 1000కేజీల వరకు దిగుబడినిస్తుందని, గెనిస గడ్డలు, చేమ గడ్డలు ప్రస్తుతం బస్తా ధర రూ.900 నుంచి 1200ల వరకు పలుకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. గెనిస సాగుకు ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల ఖర్చు అవుతుంది, ఆదాయం రూ.60వేల నుంచి రూ.80వేల వరకు వస్తుంది. కొల్లాగుంట గ్రామంలో సుమారు 40 కుటుంబాలకు పైగా గెనిసి గడ్డల సాగు చేస్తుంటారు. ఈ ఏడాది పంటల సాగుకు వాతావరణం అనుకూలించడంతో అధిక లాభాలు గడించినట్లు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అనుకూలించిన వాతావరణం

- దామోదర్ యాదవ్ రైతు, కొల్లాగుంట, కార్వేటినగరం

గతం కన్నా ఈ ఏడాది పంట వేసే సమయానికి వాతావరణం అనుకూలించడంతో పంట సాగు చేయడానికి నేల సహకరించి 80శాతం నుంచి వంద శాతం వరకు పంట దిగుబడి నిచ్చింది. అలాగే శివరాత్రికి ముందే పంట దిగుబడి రావడంతో వ్యాపారస్తులు గడ్డల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది అధిక దిగుబడి రావడంతో మంచి ఆదాయం వచ్చింది.

తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంపిపి మొగసాల రెడ్డెప్ప

మినీ వాటర్ ట్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని గంగి నాయన పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పుంగనూరు రోడ్డులోని బీసీ కాలనీలో సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి అధ్యక్షతన ఎంపీపీ నిధులు లక్ష రూపాయల ఖర్చుతో ఐదువేల లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. బైరెడ్డిపల్లి ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, స్థానిక సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి ఎంపీపీ చేతుల మీదుగా తాగునీటి ట్యాంకును మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ చేతుల మీదుగా తాగునీటిని అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, జైకుమార్ రెడ్డి, బైరెడ్డిపల్లి సర్పంచ్ వెంకటేష్, వైస్ సర్పంచ్, వైసీపీ మండల యూత్ ప్రసిడెంట్ మహేష్, జిసి పల్లి సర్పంచ్ ఝాన్సీ నాగభూషణ్ రెడ్డి, ఎంపీటీసీ వినాయక, సుజాత మోహన్, గంగినాయన పల్లి గ్రామస్తులు పాల్గొన్నారు. ఎంపిపికి గంగ నాయన పల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అధికార నంది వాహనంపై శివపార్వతులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అధికారి నంది వాహనంపై శివపార్వతులు విహరించారు. మండలంలోని మొగిలి స్వయంభు మొగిలేశ్వ రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం అధికార నంది వాహనంపై శివుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దారులుగా గాండ్లపల్లికి చెందిన సాంబశివ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. మంగళవారం రాత్రి సింహ వాహనంపై శివపార్వతులు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దారులుగా బంగారుపాలెం మండలంలోని ఉషోదయ ఉన్నత పాఠశాల యాజమాన్యం భారతీ ప్రతాప్ చంద్ర నాయుడు వ్యవ హరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శరవణ కుమార్, మధు అర్చకులు రెడ్డెప్ప గురుకుల్, విశ్వనాథ్ గురుకుల్, సోము గురుకుల్, పవన్ గురుకుల్, ఆర్యేష్ గురుకుల్ పాల్గొన్నారు.

రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఎంపిడివో

తాగునీటి సమస్య లేకుండా చూడాలి..

ప్రజాశక్తి -కార్వేటినగరం: వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామ సచివా లయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండుతున్న ఎండలను దృష్టిలో వుంచుకుని గ్రామాల్లో తాగునీటి పైపులు లీకేజీలు లేకుండా అరికట్టి గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సీడీ కండ్రిగ అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీ లించారు.

రైతు కష్టం బుగ్గిపాలు !

ప్రజాశక్తి- వెదురుకుప్పం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వెదురుకుప్పం మండలం యనమలమంద పంచాయతీ యనమల మంద గ్రామానికి చెందిన మరకాల కుప్పం కృష్ణయ్య కుమారుడు నీలకంఠం చెరకు తోట అగ్నికి ఆహుతైంది. బాధితుడు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం వల్ల చెరకు తోట దగ్ధం అయ్యిందని తెలిపారు. తమ కుటుంబం సంవత్సరకాలం కష్టపడి పెంచుకున్న చెరకు తోటను నాలుగు ఎకరాల పైగా అగ్నికి ఆహుతైందని విలేకరుల ముందు కన్నీరుమున్నీరయ్యాడు. సుమారు ఐదు లక్షల రూపాయలు వరకు నష్టం వాటిల్లిందని చెరుకు తోట యజమాని నీలకంఠం తెలిపాడు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ చేస్తున్న జై భీమ్ ఫౌండేషన్

సేవకు ప్రతి రూపం 'జై భీమ్ ఫౌండేషన్'

ప్రజాశక్తి - కార్వేటినగరం: సేవలకు ప్రతి రూపం జై భీమ్ ఫౌండేషన్ అని పాదిరికుప్పం ఉన్నత పాఠశాల హెచ్ఎం ద్రాక్షాయణి అన్నారు. మంగళవారం పాదిరికుప్పం, కత్తెరపల్లి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు జై భీమ్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజుకుమార్, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో బెస్టాఫ్ లక్ కిట్‌ను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులకు ఫౌండేషన్ తరపున పరీక్షా సామగ్రిని అందించి పేద విద్యార్థులకు అండగా నిలవడం అభినంద నీయమని కొనియాడారు. అనంతరం జై భీమ్ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో జై భీమ్ ఫౌండేషన్ పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు వంటి పరీక్షా సామగ్రిని అందించారు. కత్తెరపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చలపతి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని, పేద విద్యార్థులకు మహోన్నతమైన జీవితాన్ని అందించడానికి జై భీమ్ ఫౌండేషన్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జై బీమ్ ఫౌండేషన్ సభ్యులునరేష్. బొబ్బిలి, చిరంజీవి, ఉపాధ్యా యులు కిరణ్, దొరబాబు, పలువురు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూపై అవగాహన సదస్సు

భారీ చికెన్, ఎగ్ మేళా

ప్రజాశక్తి -పలమనేరు: భారీ చికెన్, ఎగ్ మేళాను స్థానిక కళ్యాణ మండపంలో ప్రముఖ పౌల్ట్రీ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ సంస్థ యజమానులు, అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం మన ప్రాంతంలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు కనిపించలేదని, ఇది కేవలం కొద్దిమంది చేస్తున్న ఆరోపణలు, అపోహలు మాత్రమే అని అన్నారు. నిజంగా బర్డ్ ఫ్లూ లక్షణాలు ఉంటే మొట్టమొదట పౌల్ట్రీ ఫారాల్లో పని చేస్తున్న యజమానులు, కార్మికులకు కచ్చితంగా ఈ లక్షణాలు సోకే అవకాశం ఉందన్నారు. ఎటువంటి భయ భ్రాంతి లేకుండా ధైర్యంగా చికెను, కోడిగుడ్లు తినవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్కువ సంఖ్యలో ప్రజలు రైతులు పాల్గొని చికెన్ కబాబ్ ముక్కలను, ఉడికించిన కోడిగుడ్లను తిన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపుగా 500 కేజీల చికెను, 2 వేల కోడిగుడ్లను వినియోగించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఎస్ఎన్ డైరెక్టర్ ప్రణీత్ బాబు, నెక్ జోనల్ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు, ప్రీమియర్ కంపెనీ జనరల్ మేనేజర్ డాక్టర్ వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర హేచరీస్. సందీప, బాలాజీ, పలమనేరులోని పౌల్ట్రీఫార్మ్ సంస్థ యజమానులు గాలి సుబ్రహ్మణ్యం నాయుడు, రామచంద్ర నాయుడు, గంగవరంలో కోళ్ల ఫారం నాగరాజు కుమారులు వి రామాపురానికి చెందిన నాగభూషణం నాయుడు, గోవర్ధన్ నాయుడు మొదలగు పౌల్ట్రీ ఫారం యజమానులు పాల్గొన్నారు.

చికెన్, గుడ్లు తిని చూపిస్తున్న దృశ్యం

వైభవంగా ఆలయ కుంభాభిషేకం

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు నియోజక వర్గం జగమర్ల దేవళంపేట సమీపంలో వెలసిన వందన మల్లేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కుంభాభిషేకం సోమవారం ఉదయం వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. పలమనేరు, పూతలపట్టు, పుంగనూరు నియోజక వర్గాల నుండి అశేష సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ దేవాలయం పలమనేరు పట్టణం నుండి 12 కిలోమీటర్ల దూరంలో జగమర్ల దేవలంపేట సమీపం లో పూర్తి అటవీ ప్రాంతంలో ప్రశాంతమైన వాతా వరణంలో వుంది. ఈ కార్యక్రమంలో 20 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు

ముగిసిన ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండల కార్యాలయంలో మండలంలోని అన్ని బ్యాంకులు సంబంధించి సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారు సబ్సిడీ రుణాలకు సమర్పించవలసిన పూర్తి సమాచారాన్ని అందించి రుణాలు పొందాలని ఇన్‌ఛార్జి ఎంపిడివో శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలో దరఖాస్తు చేసుకున్న 945 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. వారికి 104 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని బ్యాంకు సిబ్బంది, సచి వాలయ, సాంఘిక సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

యాదమరి చిత్రకారుని ప్రతిభ

ప్రజాశక్తి - యాదమరి: యాదమరి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె దామోద రాచారి శివరాత్రి బ్రహ్మోత్సవం సంద ర్భంగా మంగళ వారం రెండు ప్రత్యే క చిత్రాలను రూపొందించారు.

చిత్రకారుడు దామోదరం

కాఫీ పొడరుతో చిత్రించిన బొమ్మ

శ్రీకాళహస్తీశ్వర మహత్యం అంశంగా కాఫీ పౌడర్ తో ప్రత్యేకంగా 'శివ దర్శనం నిదర్శనం' అనే చిత్రాన్ని యాదమరి ఉన్నత పాఠశాల ఆర్కె దామోదరాచారి చిత్రించారు. క్షీరసాగరం మధనంలో ఉద్భవించిన హాలాహలాన్ని శివుడు ఆరగించే సన్నివేశం కాఫీ పౌడర్‌తో అద్భుతంగా చిత్రించారు.

పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ విస్తరణ అధికారి

పారిశుధ్యంపై అవగాహన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వెదురుకుప్పం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు 'స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర'పై అవగాహన కల్పించారు. మంగళవారం ఎస్ డబ్ల్యూ పిసి షెడ్లు, వాటి నిర్వహణ గురించి విస్తరణ అధికారి పురుషోత్తం అవగాహన ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఈ షెడ్లు నిర్వహణ షెడ్లలో మౌలిక సదుపాయాల కల్పన, వర్మి కంపోస్ట్ తయారీ, ప్రతి ఇంటి నుండి రోజూ చెత్త సేకరణ, ఇంటి పన్నులు వసూలు, పేద దిబ్బలు తొలగించడం, ప్రతి 15 రోజులకు ఒకసారి తాగు నీటి సరఫరా ట్యాంకులను శుభ్రం చేయ డం, పారిశుధ్య నిర్వహణ లోపం లేకుండా చూడడం, వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా తగు ముందు జాగ్రత్తలు తీసుకోవడం వంటి వాటిపై సర్పంచులకు , పంచాయతీ కార్యదర్శులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల నిప్పు

- మామిడి చెట్లు దగ్ధం
- రూ.75 వేల ఆస్తి నష్టం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని చీలంపల్లి గ్రామ రైతుల పొలాల్లో డంపింగ్ యార్డ్ పక్కనే వున్న మామిడి చెట్లు, డ్రిప్ పైపులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఫలితంగా రైతుకు 75 వేల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. పంచాయతీ డంపింగ్ యార్డ్ సమీపాన వున్న రైతు ముని రెడ్డి మామిడి చెట్లు అగ్నికి ఆహుతి అయి రూ.20 వేల ఆస్తి నష్టం వచ్చింది. భయా రెడ్డి యాదవ్ అనే రైతుకు 50 సెంట్ల పొలంలో డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. దీనివల్ల 55 వేల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లింది. అంతేకాకుండా సుమారు ఐదు ఎకరాలకు పైన ఆవులు మేస్తున్న బీడు అగ్నికి ఆహుతై మేత కరువైనట్లు ఆ గ్రామ రైతులు తెలిపారు.

మందులు పంపిణీ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీడి నెల్లూరు మండల శాఖ ఆధ్వర్యంలో మందులు వితరణ చేశారు. మంగళవారం నంద్యాల రెడ్ క్రాస్ శాఖ నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు చేయూతగా దాతల సహకారంతో 33 రకాల మందులు సేకరించి నంద్యాల జిల్లాకు మంగళవారం కొరియర్ ద్వారా పంపారు. శివరాత్రి సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి సుమారు 400 మంది భక్తులు వైద్య సహాయం పొందేందుకు ఈ మందులు ఉపయోగపడతాయని గంగాధర నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పాపిరెడ్డి, జిల్లా కార్యదర్శి, లు తెలిపా రు. ఈ మందుల సేకరణ కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యులు ఎంవి శ్రీధర్ రెడ్డి, అరుణకుమారి, డాక్టర్ విజయకుమార్ రెడ్డి డాక్టర్ రాజన్న, జీవిత, సభ్యులు ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మోడల్ స్కూలులో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. 2025 సంవత్సరంలో ప్రవేశానికి ఇప్పటి నుండి 31 మార్చి 2025 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఎస్సి, ఎస్టి, పీహెచ్‌కు చెందినవారు 75 రూపాయలు, ఓసి, బిసి ఈడబ్ల్యూఎస్ కులానికి చెందినవారు ఒక విద్యార్థికి 150 రూపాయలు ఫీజు చెల్లించాలని తెలిపారు. ఆసక్తికలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు హచ్‌టిటిపిఎస్: ఎపిఎంఎస్, ఎపిసిఎఫ్ఎస్-ఎస్.ఇన్ లేదా హెచ్‌టిపిపిఎస్: సిఎస్ఇ.ఎపి.జివోవి.ఇన్ ద్వారా దరఖాస్తు రుసుం చెల్లించి దాని ద్వారా వచ్చిన జనరల్ నెంబర్ ఉపయోగించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఆధారంగా, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం ఇస్తామని, వివరాలకు 8247273848 నెంబర్ కు కాల్ చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ అనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

బైరెడ్డిపల్లిలో శిక్షణ సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని ఎంఈఓలు నాగేశ్వరరావు, రమేష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని మొగలిమిట్టూరు, తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్ వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి ముగింపు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 101 అంగన్‌వాడీ కేంద్రాల నుండి నుండి 99 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణకు హాజ రయ్యారని, గ్రామీణ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలు ఆకర్షితులయ్యే విధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తయారు చేయాలని పిల్లలకు ఆట పాటలతో విద్య నేర్పించి వారిని ఆకట్టుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతం లోని అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు జ్ఞాన జ్యోతి సువర్ణ అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు పార్థసారథి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యా యులు పట్టాభి, సూపరువైజర్లు జయ శ్రీ, ఆర్‌పిలు మోహన్ రెడ్డి, షబానాభాను, ధనుంజయ, చంద్ర సిఆర్‌పిలు ప్రేమలత, కృష్ణమూర్తి, అంగన్‌వాడీ కార్యకర్త లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: కోర్సు డైరెక్టర్, ఎంఈవో సుబ్రమణ్యం అధ్యక్షతన ఆరు రోజుల పాటు అంగన్‌వాడీలకు నిర్వహించిన జ్ఞాన జ్యోతి శిక్షణ మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపిడివో రాజేంద్ర బాలాజీసైసిడిఎస్ సిడిపివో అరుణశ్రీ, అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ పూర్తి చేసిన సర్టిఫికెట్లు 73 మంది అంగన్‌వాడీ టీచర్లకు అందించారు. ఈ శిక్షణలో నేర్చుకున్న వాటిని బోధనలో పిల్లలకు తెలిపి అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రాజేంద్ర బాలాజీ, ఎంఈవో సుబ్రహ్మణ్యం, సిడిపివో అరుణశ్రీ, కెఆర్‌పి శశికుమార్, డిడి ఆర్‌పిలు ఐదుగురు, శిక్షణ మాస్టర్, సూపరు వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందిస్తున్న విద్యాశాఖాధికారి

ఐరాల: ఆరు రోజుల జ్ఞానజ్యోతి మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు ఋషీంద్రబాబు, దామోదర్ నాయుడు మాట్లాడుతూ పాఠశాల విద్య బలోపేతానికి పూర్వ విద్య అత్యవసరమని, అంగన్వాడి ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆట పాటల ద్వారా బోధించి, బడిబాట పట్టేటట్లు చూడాలని కోరారు. ఈ సందర్భంగా యోగ శిక్షణ ఇచ్చిన రామచంద్ర మిషన్ యోగ కేంద్రం చిత్తూరు వారు వీర రాఘవ నాయుడు, కృష్ణమ నాయుడును సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లుగా ఉపాధ్యాయులు రేఖ, సుధాకర్, అరు ణ్, జనార్ధన్ వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు కోమల, సిడిపిఓ నిర్మల, సూపరువైజరు మంజుల, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి -పుంగనూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న శాశ్వత, ఒప్పంద ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మధుసూదన్ రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17 నుండి మార్చి 6 తేదీ వరకు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపట్టామని తెలిపారు. పర్మినెంట్, పారిశుధ్య కార్మికులకు మూడు సంవత్సరాల పెండింగ్ లీవులు, ఎన్‌హేన్స్‌మెంటు డిఏలు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులను, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. వీరిని కూడా పర్మినెంటు ఉద్యోగుల వలే 62 సంవత్సరాలు కొనసాగించాలన్నారు. పారిశుధ్య కార్మికుల జీతభత్యాలు మున్సిపాల్టీ భరించాలని సూచించారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించకూడదని, గత ప్రభుత్వం కార్మిక సంఘాల వద్ద చేసుకున్న ఒప్పందం చేసుకున్న వాటిని అమలు చేయాలని కోరారు. పారిశుధ్య కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి కే రామమూర్తి , పుంగనూరు నియోజకవర్గం ఏఐటీయూసీ నాయకులు పి వెంకటరమణారెడ్డి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.A. No. 16/2025
E.P. No. 13/2024
O.S. No. 45/2009
Between:
Kondeti Nagaratnam & Others
...Petitioners/ DHr's
AND
Raparthi Govindarajulu & Others
...Respondents/ JDr's
R-12: Kaki Someswara Rao, S/o. Chittabbai, age 53 years, Business, Door No. 13-8-227, Pedagantalamma Gudi Daggara, Govindarajulu Gudi Veedhi, Totayya Gunta, Pedda Tirupathi, Chittor District, Andhra Pradesh.
పై నెంబరు దావాలో పై నెంబరు E.P. లో శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం పైన ఉదహరించిన R12 కు ఆర్డరు 21, Rule 22 C.P.C. ప్రకారం నోటీసులు ఎన్ని పర్యాయములు మీకు నోటీసులు పంపిననూ మీరు బుద్ధిపూర్వకముగా తీసుకొనడం లేదు. కావున పై నెంబరు E.A. లో శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం పైన ఉదహరించిన R12 JDr కు హాజరు నిమిత్తం పై కోర్టులో మీకు వాయిదా ది. 04-3-2025న వేసినారు. కావున పైన ఉదహరించిన R12 JDr కు పై కోర్టులో పై E.A. లో హాజరై **ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వాయిదా అయిన **ది. 04-3-2025న** హాజరై మీకు అక్షేపణలు ఉన్న ఎడల చెప్పుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై శ్రీ కోర్టు వారు తదుపరి చర్య తీసుకొనబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.
వాయిదా: 04-3-2025
ఎ.వి.రామారావు, అడ్వకేట్
అడ్వకేట్ టు పిటీషనర్లు/ DHr's
పిఠాపురం, కాకినాడ జిల్లా
పిఠాపురం
24-2-2025

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే ఫిర్యాదు చేయాలి: సిఐ

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలో ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే తమకు ఫిర్యాదు చేయాలని సిఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. పుంగనూరు పట్టణంలోని బాలికల హై స్కూలులో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సిఐ మాట్లాడుతూ స్థానిక బాలికలను ఎవరైనా వీధులలో ఈవ్ టీజింగ్ కు పాల్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని పుంగనూరు సిఐ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మాయిల రక్షణ పట్ల ఎంతో శ్రద్ధ తీసుకుంటోం దన్నారు. ఎంత చిన్న సమస్య అయినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ జనరల్ సెక్రెటరీ మధుమోహనరావు పాల్గొన్నారు.

విధ్వంసం నుండి కాపాడటమే కూటమి లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- యాదమరి: విధ్వంసం పాలన నుండి రాష్ట్రాన్ని కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం సరికాదని, ప్రజల్లో అపోహలు కలిగించే ప్రయత్నాలు మాత్రమే అని ఆయన అన్నారు. అసెంబ్లీలో గవర్నరు ప్రసంగానికి మంగళవారం శాసనసభలో ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చోటుచేసుకున్న విధ్వంసం నుంచి రాష్ట్రం ముందుకు సాగుతున్న తరుణంలో, కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల కాలంలో సాధించిన విజయాలను గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం హయాంలో భయాందోళన కలిగించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ చట్టం రద్దు చేసిందన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి 17,400 గ్రామాల్లో ప్రజల భూ సమస్యల పరిష్కారం చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం దాదాపు రూ. 1,40,000 కోట్ల మేర బకాయిలు మిగిల్చిందని వీటిని తగ్గించుకుంటూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే విధంగా ఆర్థిక విధానాలను రూపొందించిందన్నారు. పెన్షన్ పెంపు, వికలాంగులకు సాయం, గ్యాస్ కనెక్షన్లు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని, దీపం-2 ఉచిత గ్యాస్ పథకం అందిస్తోందన్నారు. ఉగాదికి ఉచిత బస్సు సౌకర్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలన విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, దాన్ని సరిదిద్దుకునే చర్యలు చేపట్టామన్నారు. వీటిని వివరించిన గవర్నరు ప్రసంగాన్ని అడ్డుకోవడం వైసిపి వారికి తగదన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రాథమిక దశలో నైపుణ్యత పెంపొందించాలి

ప్రజాశక్తి -పుంగనూరు : ప్రాథమిక దశలోనే విద్యార్థు లకు నైపుణ్యత పెంపొందిం చాలని సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటరమణ అన్నా రు. పుంగనూరు బస వరా జ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో జరుగుతున్న జ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని ఆయన పరిశీలిం చారు.

క్రైం న్యూస్

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాశక్తి -బంగారుపాలెం: విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని నల్లం గాడు కోటూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సదాశివ భార్య చిట్టెమ్మ (55) అదే గ్రామానికి చెందిన సురేంద్రబాబు వ్యవసాయ పొలంలో వరి పైరుకు కలుపుతీయడంలో నిమగ్నమయ్యారు. పొలం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకొని ఉన్న పచ్చటి తీగలు ఇనుప ఫెన్సింగ్‌పై వుండగా వాటిని సదరు ఫెన్సింగ్ కమ్మి చిట్టెమ్మ విద్యుత్ షాక్‌కు గురైంది.వెంటనే ఆమె మృతి చెందింది. కుటుంబ యాజమాని సదాశివయ్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం బంగారుపాల్యం ప్రభుత ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా తయారీ స్థావరాలపై దాడులు

- 400 లీటర్ల ఊట ధ్వంసం, 25 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కార్వేటినగరం: జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సారా తయారీ స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు సివిల్ ఎస్ఐ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం దాడుల్లో స్వాధీనం చేసుకున్న 25 లీటర్ల సారా, సారా పరికరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలోని కొటార్వేడు దళితవాడకు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో సారా తయారీ జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి అదే గ్రామానికి చెందిన శ్రీరాములు సారా తయారీకి సిద్ధం చేసి ఉంచిన వంద లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అతనిపై కేసునమోదు చేసినట్లు వెల్లడించారు. కనికాపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించి గోపిశెట్టిపల్లి దళితవాడకు చెందిన గోవిందరాజులు సారా తయారీకు సిద్ధం చేసి ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. అమ్మకాని సిద్ధంగా ఉంచిన ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అతనిపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమార్జనలో భాగంగా సారా తయారీలు, అమ్మకాలు చేపడు తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరా రు. మునికృష్ణ. రాజశేఖర్.యుగంధర్, ఢిల్లీబాబు పలువురు ఉన్నారు.

గుండె పోటుతో విఆర్‌వో మృతి

విఆర్ఓ ధరణి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-పూతల పట్టు: పూతలపట్టు విఆర్ఓ ధరణి (40) గుండె పోటుతో మంగళవారం మృతి చెందారు. కుటుంబీకుల కథనం మేరకు.. మధ్యాహ్నం భోజనం చేసి విశ్రాంతి కోసం పడుకున్న ఆయనకు హఠాత్తుగా నోటిలో నుంచి నురగ రావడాన్ని గుర్తించిన తాము వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామని తెలిపారు. అప్పటికే గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. గతంలో పెనుమూరు మండలంలో పనిచేస్తూ ఇటీవలే పూతలపట్టు మండలానికి బదిలీపై వచ్చారు. సౌమ్యుడిగా గుర్తింపు పొందిన ఆయన మృతి పట్ల మండల రెవెన్యూ సిబ్బంది విచారం వ్యక్తం చేస్తున్నారు.

హోదా కోరుకోవడం జగన్ నియంత ధోరణికి నిదర్శనం: మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -శాంతిపురం : తనకు హోదా కావాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకోవడం ఆయన నియంత ధోరణికి సాక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి అధికార ప్రతినిధి,ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం ఈ 8 నెలల్లో కూటమి ప్రభుత్వం ఏ చేసింది, భవిష్యత్ లో చేయబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి దశ, దిశను ఇవ్వడం జరిగింది అని టిడిపి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు అన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో ప్రతిపక్ష పార్టీ మ్మెల్యేలు వ్యవహరించిన తీరు దుర్మార్గంగా వుందన్నారు.

NOTICE UNDER ORDER 21 RULE 22 CPC IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PILER
OEP NO. 02 OF 2024
OS No. 47/2014 (on the file of the Prl. Senior Civil Judge's Court, Tirupati)
E. Sahadeva Reddy. ...Petitioner/D.Hr.
Vs
M. Madhusudhana Reddy. ...Respondent/J.Dr.
NOTICE TO RESPONDENT/J.DR.
M. Madhusudhana Reddy, S/o M.Vasudeva Reddy, r/at D.No. 4-19/1, Srikrishna Nagar, M.R. Palli, Tirupati-2, Tirupati District, presently r/at Kondreddygaripalli, H/o Peddagottigallu, Rompi cherla Mandal, Chittoor District.
వ్యాజ్యములో డిగ్రీని అమలు నెరవేర్చుడమునకు యూ కోర్టుకు మనవి చేసుకొని వుండేటందుకు డిక్రీని అమలు నేర వేర్చుటమునకు యేందు నిమిత్తము వుత్తరవులు యివ్వకూడ దో మీకు తెలియజేయడమునకు నీకు 2025 వ సంవత్సర ము మార్చి నెల 04వ తేది ఉదయము 10 గంటలకు ఈ కోర్టు ఎదుట హాజరు కావలసినదిగా తెలియ జేయడమైనది.
//By Order of Court//
సి. వెంకటరమణ రెడ్డి, బి.కాం.,బి.ఎల్.,
న్యాయవాది,
పీలేరు.

IN THE COURT OF THE XI ADDITIONAL DISTRICT JUDGE, PILER
M.V.O.P. No. 06 OF 2014
V.Basha @Chand Basha.
...Petitioner
Vs
N.Varadappan and others
...Respondents
NOTICE TO RESPONDENT NO. 3
C. Manikyam, S/o Chinnappa, r/at D.No: 3-98E, Gandhi Nagar, Mitturu, Kodalam Post, Vellore Taluk, Namakkal District, Tamilnadu.
Whereas the above named petitioner had filed the above MVOP petition for grant of compensation. If you have got any objection, you may appear before this Court at 10:30 AM on 06-03-2025 either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided ex-parte.
//By Order of Court//
C. VENKATARAMANA REDDY, B.Com., B.L.,
Advocate,
PILER.

IN THE COURT OF THE XI ADDITIONAL DISTRICT JUDGE, PILER
I.A.No: 161/2019 in
M.V.O.P. No. 06 OF 2014
V.Basha @Chand Basha.
...Petitioner/Petitioner
Vs
N.Varadappan and others
...Respondents/Respondents
NOTICE TO RESPONDENT NO. 3
C. Manikyam, S/o Chinnappa, r/at D.No: 3-98E, Gandhi Nagar, Mitturu, Kodalam Post, Vellore Taluk, Namakkal District, Tamilnadu.
Whereas the above named petitioner had filed the above petition in the above matter for appointment of commissioner. If you have got any objection, you may appear before this Court at 10:30 AM on 06-03-2025 either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided ex-parte.
//By Order of Court//
C. VENKATARAMANA REDDY, B.Com., B.L.,
Advocate,
PILER.